పేదల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం



రావివలసలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: పేదల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని రావివలస గ్రామసచివాలయం పరిధిలోని గిరిజన గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో రావివలసలోని ప్రాథమిక పాఠశాలను ఆధునీకరించాలని అక్కడి ప్రజలు విజ్ఞప్తి చేయగా, వెంటనే ఆ సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. వీటితో పాటు సభలు, సమావేశాలు, సదస్సుల్లో ఇచ్చిన మరెన్నో హామీలను సీఎం జగనన్న నెరవేర్చారని పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు మేలు జరిగేలా రాష్ట్రంలో పథకాల అమలు జరుగుతోందన్నారు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఓ వైపు సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతూనే, నిర్విరామంగా సంక్షేమ పథకాల అమలు చేయడం జరుగుతోందన్నారు. ప్రతీ పథకం నగదు లబ్ధిదారుని బ్యాంకు ఖాతాకే నేరుగా డీబీటీ విధానం ద్వారా జమ చేసి, అవినీతికి తావులేకుండా ప్రభుత్వం తన పారదర్శక పాలనను నిరూపించుకుంటోందన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రదాత.. సంక్షేమ సారథి అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి, ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, బొబ్బిలి మండల ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎన్ రాయులు, సర్పంచ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన



ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు వివరించి, బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో పారదర్శక పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. సోమవారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని కాకర్లవీధి, కంచర వీధి, పుచ్చలవీధి, కుమ్మరివీధి, శెగిడి వీధుల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ఆయా ప్రాంతాల ప్రజలు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అవి అందుతున్న తీరుపై ఆరాతీశారు. అలాగే ఆ వార్డులో సచివాలయ ఉద్యోగుల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలపై ప్రజలు నుంచి అభిప్రాయాలు సేకరించారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఓ వైపు సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతూనే మరోవైపు నిరంతరాయంగా పథకాల అమలు జరుగుతోందన్నారు. అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. గతంలోని ఏ ప్రభుత్వమూ ఇలా పరిపాలించలేదన్నారు. ప్రభుత్వ పథకాల నగదు లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా డీబీటీ విధానం ద్వారా జమ చేస్తుండడంతో అవినీతికి అడ్డుకట్ట పడిందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, పథకాలు అందుతున్నాయన్నారు. గతంలో అధికారంలోని టీడీపీ చాలా అక్రమాలకు పాల్పడిందని, ఇప్పుడు మళ్లీ ఆ పార్టీ నేతలు బస్సుయాత్ర, పాదయాత్ర పేరిట ప్రజలను మోసగించేందుకు సిద్ధమయ్యారని, మోసపోవద్దని ప్రజలకు హితవుపలికారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ బి. లలితకుమారి, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యాసామర్థ్యాల పరిశీలన



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు

బొబ్బిలి: మండలంలోని పెంట గ్రామ ఎంపీపీ పాఠశాలను డిప్యూటీ డీఈఓ సోమవారం సందర్శించారు. అనంతరం ఆయన తరగతుల వారీగా అక్కడి విద్యార్థుల దగ్గరకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా వారి విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందేలా చూడాలని, మెరుగైన విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఘనంగా 'అయ్యంకి' జయంతి



అయ్యంకి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న పాఠకులు, లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన పాఠకులు, లైబ్రేరియన్ కృష్ణమూర్తి తొలుత అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయాల ఏర్పాటుకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని, ఎంతోమంది ఉన్నతులుగా తయారయ్యారన్నా, మరెంతో మందికి గ్రంథాలయాల్లో ఉద్యోగాలు దొరికాయన్నా అది అయ్యంకి పుణ్యమేనన్నారు.

21 మద్యంసీసాల స్వాధీనం

సంతకవిటి: మండలంలోని సిరిపురం గ్రామంలో శెగిడి వీధిలో బొమ్మిడి అప్పన్న అనే వ్యక్తి వద్ద నుంచి అక్రమంగా నిల్వ ఉంచిన 21 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లోకేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, అక్రమంగా మద్యం తరలించినా, అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కౌలురైతుల గుర్తింపును వేగవంతం చేయండి

సంతకవిటి: కౌలురైతుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ఏఓ పి.నవీన్ సూచించారు. సోమవారం మండలంలోని మిర్తివలస ఆర్‌బీకేలో సిబ్బందితో సమావేశమైన ఆయన విధి నిర్వహణలో అలసత్వం వద్దని, రైతులను నిత్యం అందుబాటులో ఉండాలని తెలిపారు. అలాగే ఆర్‌బీకేలోని ఎరువులను రైతులకు రాయితీపై ఇవ్వాలన్నారు.

సర్పంచ్ సేవాభావం



సొంత డబ్బులతో రోడ్డు బాగు చేయిస్తున్న సర్పంచ్ నర్సింహమూర్తి

సంతకవిటి: మండలంలోని అప్పలఅగ్రహారం గ్రామానికి చెందిన సర్పంచ్ దవళ నర్సింహమూర్తి తన సేవాభావాన్ని చాటుకున్నారు. గ్రామ సమీపంలోని ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డుపై నిలిచిపోయిన వర్షపునీటితో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఆయన ప్రొక్లెయిన్‌తో రోడ్డుకు ఇరువైపులా కాలువలు తవ్వించి నీరు బయటకు వెళ్లేలా పనులు చేయించారు. అనంతరం రోడ్డుపై పిక్కరాయి వేయించి, రోడ్డుపై ప్రయాణాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ తన సొంత డబ్బులతో ఈ పనులు చేయించడాన్ని అందరూ అభినందిస్తున్నారు.

కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి



చాటాయవలసలోని పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ మురళీకృష్ణ

రేగిడి: రైతులు వరినాటు వేసిన వెంటనే కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. సోమవారం మండలంలోని రేగిడి, వండానపేట, చాటాయవలస గ్రామాల్లో వరినాట్లు వేసిన పొలాలను పరిశీలించిన ఆయన పంటలో కాలిబాటలు ఉంటే పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి పంట బాగా పెరుగుతుందన్నారు. ఎరువులు చల్లేందుకు కాలిబాటలు ఉపయోగపడతాయన్నారు.

ఆయుర్వేదంతో మెరుగైన ఆరోగ్యం

రేగిడి: ఆయుర్వేద వైద్యంతో మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఆయుర్వేద వైద్య శిబిరం సోమవారం నిర్వహించి, కీళ్లనొప్పి, నడుమునొప్పి వంటి దీర్ఘకాలిక సమస్యలతో బాధపడే వారికి ఉచితంగా మందులు అందజేశారు.

అంగన్‌వాడీ టీచరా.. లేక రాజకీయ నాయకురాలా..?



అంగన్‌వాడీ టీచర్ విమర్శలను ఖండిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- ఎమ్మెల్యేపై అంగన్‌వాడీ టీచర్ విమర్శలు చేయడంపై వైఎస్సార్ సీపీ నేతల మండిపాటు

రామభద్రపురం: ఓ అంగన్‌వాడీ టీచర్ అయి ఉండి, రాజకీయ వ్యవహారాల్లో తలదూర్చుతూ లేనిపోని ఆరోపణలతో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడును విమర్శించడం తగదని స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–6 టీచర్ చెంచులక్ష్మి తీరుపై మండల వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. ఇదే విషయమై మండల కేంద్రంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎన్ రాయులు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు మాట్లాడారు. రాజకీయ నాయకురాలి అవతారమెత్తి, ఎమ్మెల్యే అనని మాటలను కూడా వక్రీకరిస్తూ విమర్శలు చేసి, దానిని వీడియోగా చిత్రీకరించి పలు వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు నీకు ఏ అర్హత ఉందని ఎమ్మెల్యేను విమర్శిస్తున్నావని ప్రశ్నించారు. ఇటీవల మండలంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి ఆయన ఏం అభివృద్ధి చేశారో చెప్పకుండా బొబ్బిలి రాజులను విమర్శించారని, రామభద్రపురం మండల కేంద్రంలో చాలా సమస్యలున్నాయని, వాటిని పట్టించుకోవాలని, జగనన్న కాలనీ ఇళ్లు నిజమైన లబ్ధిదారులకు అందలేదని ఇదేనా మీ పనితీరు అని ఆమె ఎమ్మెల్యేను ఉద్దేశించి, మాట్లాడిన తీరు కలవరానికి గురిచేసింది. ఓ అంగన్‌వాడీ టీచర్ అయి ఉండి, రాజకీయాల్లో ప్రతిపక్ష నేతల మాదిరి మాట్లాడడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతగా రాజకీయాలు చేయాలన్న ఆసక్తి ఉంటే ఉద్యోగానికి రాజీనామా చేసి, ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని న్నారు. ఆమె అంగన్‌వాడీ టీచర్‌గా ఎంత నిజాయితీగా విధులు నిర్వహిస్తుందో అందరికీ తెలిసిందేనన్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఎంత అభివృద్ధి చేశారో ప్రజలకు బాగా తెలుసన్నారు. రాజకీయ నాయకురాలు లాగా ఎమ్మెల్యేను విమర్శిస్తూ ఆమె ఆడిన మాటల ఆడియో, వీడియోలను కలెక్టర్‌కు చూపించి, ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు దర్రు పైడిరాజు, సిల్ల రామారావు, కటికి చిన్నారావు, కటికి శ్రీనివాసరావు, కనిమెరక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో ఇంటి వద్దకే సేవలు



రేగిడి: బూరాడలో ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న వైస్ ఎంపీపీ జగన్మోహనరావు

రేగిడి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు అన్నారు. సోమవారం మండలంలోని బూరాడ, మునకలవలస గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పలువురు అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా జనన, మరణ, కుల, ఆదాయం వంటి 12 రకాల సిటిజన్ సర్వీసులను ప్రభుత్వం అందిస్తోందని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వి.శశిభూషణరావు, వి.చంద్రశేఖరరావు, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి, ఎంపీడీఓ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి

- ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ



సూచనలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆయన శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై ఆరాతీశారు. జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న లేఅవుట్లలో తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని మండల ఇంజినీరింగ్ ఏఈ రాజశేఖర్‌కు చెప్పారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఉద్యాన పంటల పెంపకానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఉపాధి హామీ పథకం ఏపీఓ సుశీలకు సూచించారు. ఈఓపీఆర్‌డీ రాంబాబు పాల్గొన్నారు.

మీనామృతం తయారీపై అవగాహన



మీనామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

తెర్లాం: పంటలపై మీనామృతం పిచికారీ చేయడం ద్వారా అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం పూనువలస క్లస్టర్ మండల యాంకర్ ఆర్నేపల్లి సింహాద్రినాయుడు తెలిపారు. మండలంలోని పెదపాలవలస గ్రామంలోని ఎన్‌పీఎం షాపు వద్ద మీనామృతం తయారీపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. నాలుగేసి కేజీల చొప్పున బెల్లం, చేపల వ్యర్థాలు తీసుకుని, ఒక పాత్రలో వేసుకుని 15 రోజుల పాటు మరగబెట్టాలన్నారు. రోజుకోసారి మాత్రమే కలపాలని, ఆ తర్వాత గుడ్డతో మూతపెట్టాలన్నారు. 15 రోజుల తర్వాత 2 లీటర్ల మీనామృతం ద్రావణాన్ని తీసుకుని, 15 లీటర్ల ఆవుమూత్రంలో కలపాలన్నారు. ఈ రెండింటి మిశ్రమాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి, దానిని ఒక ఎకరాల పొలంలోని పంటలపై పిచికారీ చేయాలన్నారు. ఈ విధంగా చేయడం ద్వారా పంటను ఆశించే చీడపీడలు నివారణతో పాటు పంటకు గ్రోత్ ప్రమోటర్‌గా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఐసీఆర్‌పీ భాగ్యం పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



కాలువ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ

- ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ

వంగర: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. మండల కేంద్రంలో రూ.5 లక్షల వ్యయంతో సీసీ కాలువ నిర్మాణానికి ఆయన సోమవారం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఓ వైపు గ్రామసచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతూనే మరోవైపు సంక్షేమ పథకాల అమలును నిరంతరాయంగా కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఆయనతోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమన్నారు. అక్కడి నుంచి మండలంలోని కె.కొత్తవలస ప్రాథమిక పాఠశాలకు వెళ్లిన ఎంపీపీ, విద్యార్థుల విద్యాప్రమాణాలు, జగనన్న గోరుముద్ద పథకం అమలును పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. నాడు–నేడు పనుల్లో జాప్యం జరగకుండా చూడాలని ఎంఈఓ దుర్గారావుకు ఎంపీపీ సూచించారు. భూమిపూజ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కె.పారినాయుడు, బి. అప్పలనాయుడు, టి.స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు జాబితా తయారు కావాలి



బొబ్బిలి: ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

బొబ్బిలి: పక్కాగా ఓటరు జాబితా తయారు కావాలని, ఆ దిశగా బీఎల్ఓ(బూత్ లెవల్ ఆఫీసర్)లు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు సూచించారు. మండలంలోని గున్నతోటవలస గ్రామంలో జరుగుతున్న ఇంటింటా ఓటర్ల సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. సర్వే ఎలా చేస్తున్నారు.. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు సక్రమంగా చేపట్టాలని తెలిపారు.

రేగిడి: మండలంలోని సంకిలి, చిన్నయ్యపేట, మజ్జిరాముడుపేట, అప్పాపురం గ్రామాల్లో ఓటరు సర్వే చాలా చురుగ్గా కొనసాగుతోంది. తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి ఈ సర్వేను పరిశీలించి, వివాదాలకు తావులేకుండా ఓటర్ల జాబితా తయారయ్యేలా చూడాలన్నారు.

బాడంగి: ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు పాటిస్తూ పక్కాగా ఎన్నికల జాబితా తయారు చేయాలని తహసీల్దార్ ఎ.రఫీజాన్ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశమైన ఆయన ఓటరు ఇంటికి వెళ్లే ముందు వారికి వస్తున్నట్లు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతిరోజూ సర్వే నివేదిక తెలియజేయాలన్నారు. ఎంపీడీఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో తహసీల్దార్ ఎస్.కె.రాజు సోమవారం సమావేశమై, ఓటర్ల జాబితా తయారీపై దిశానిర్దేశం చేశారు. పక్కాగా ఇంటింటికీ వెళ్లి, సర్వే నిర్వహించి, ఓటర్ల జాబితా తయారు చేయాలని సూచించారు. డబుల్ ఎంట్రీలను తొలగించాలన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లంతా ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఉండేలా చూడాలన్నారు. సర్వే సక్రమంగా చేయకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షిప్తంగా...

శతశాతం సెమిస్టర్–2 పుస్తకాల పంపిణీ

బొబ్బిలి: మండలంలో శతశాతం మేర సెమిస్టర్–2 పుస్తకాల పంపిణీ జరిగింది. అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కేవలం మూడు రోజుల్లోనే పుస్తకాలను పంపిణీ చేయడం జరిగిందని ఎంఈఓ చల్ల లక్ష్మణరావు సోమవారం తెలిపారు. సెమిస్టర్–1 పుస్తకాలను జూన్ నెలలోనే ఇవ్వగా ఇప్పుడు మండలంలోని 91 పాఠశాలలకు సెమిస్టర్–2 పుస్తకాలు ఇవ్వడం పూర్తయిందన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

రాజాం: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడికక్కడే నీటి నిల్వలు కనిపిస్తున్నాయి. దీంతో దోమలు విజృంభించకుండా నీటి నిల్వలను తొలగించడంతో పాటు మురుగుకాలువల్లో యాంటీ లార్వా ఆపరేషన్ చేపడుతున్నారు. దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు అన్ని వార్డుల్లోని కాలువల్లో దోమలమందు స్ప్రే చేస్తున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తెలిపారు.

కనీస వేతనం ఇవ్వాలి

రామభద్రపురం: కనీస వేతనం ఇవ్వాలని పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని జాతీయ రహదారిపై కార్మికులు సోమవారం బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ నేత బలస శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమాన పనికి సమాన వేతనం మంజూరు చేయాలని మండల కేంద్రంలోని పారిశుద్ధ్య కార్మికులంతా దాదాపు 25 రోజులుగా సమ్మె చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వాలని లేకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి

రేగిడి: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు సూచించారు. సోమవారం స్థానిక యువతతో సమావేశమైన ఆయన ఇప్పటి యువత ఏ విధంగా చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారన్న విషయం వివరించారు. ఖైనీ, గుట్కా, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లి, జీవితం నాశనం చేసుకోవద్దని, బాగా చదువుకుని, ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు.

పైపులైన్ పనుల పరిశీలన

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని కొత్తవలస గ్రామంలో శరవేగంగా జరుగుతున్న తాగునీటి పైపులైన్ పనులను మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు సోమవారం పరిశీలించారు. గ్రామస్తులు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం ఎమ్మెల్యే కంబాల జోగులు దృష్టికి రాగా ఆయన ఆదేశాల మేరకు పనులు ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలోని గంగిరెడ్ల వీధిలో పబ్లిక్ కుళాయిలు కూడా ఏర్పాటు చేశామన్నారు.

మున్సిపల్ కార్మికుల హామీలు నెరవేర్చాలి

రాజాం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన గత నాలుగేళ్లలో కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చకపోవడం దారుణమన్నారు. హామీలు నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 27వ తేదీన చేపట్టనున్న మున్సిపల్ కార్యాలయాల ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆగస్టు 7వ తేదీన పనులు బంద్ చేయడంతో పాటు కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, గురువులు, లక్ష్మి, కనకరాజు, రఘు, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీఎంఏవై అవార్డులకు ఇళ్లను ఎంపిక చేయండి

బాడంగి: పీఎంఏవై(ప్రధానమంత్రి ఆవాస్ యోజన) ద్వారా మంజూరై, ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన ఇళ్ల నిర్మాణాలను పీఎంఏవై అవార్డులకు ఎంపిక చేయాలని సీఎల్‌టీసీ ఎస్.వెంకటరమణ సూచించారు. ఇదే విషయమై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఇంజినీరింగ్ సహాయకులతో మాట్లాడిన ఆయన మండలంలో మొత్తం 967 పీఎంఏవై ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, వీటిలో వారానికి 74 ఇళ్ల చొప్పున వాటి ఫొటోలు, వీడియోలు తీసి సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఆహ్లాదకర వాతావరణంలో అత్యంత సుందరంగా కట్టిన ఇళ్లను అవార్డులకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మండలానికి 5 అవార్డులు ఇవ్వడం జరుగుతుందని, ఈ ఎంపిక కార్యక్రమం ఆగస్టు 1 నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు చేపట్టాలని, 2024 జనవరిలో ప్రధానమంత్రి చేతులమీదుగా అవార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ ఎస్.సత్యం తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో 'స్పందన' సమస్యలు పరిష్కరించాలి



మెంటాడ: వినతిపత్రం స్వీకరిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమ్



తెర్లాం: సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేస్తున్న సుందరాడ గ్రామ మహిళలు

రాజాం: స్పందన కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు ఆదేశించారు. జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పలు శాఖల మండల స్థాయి అధికారులతో సమావేశమైన ఆయన ప్రతీ గ్రామంలో పారిశుద్ధ్య పనులు జరిగేలా చూడాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగిన పంచాయతీల్లో రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ జేఈ ప్రభాకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జగన్మోహనరావు, ఏపీఓ సాయిరాం, ఏపీఎం దధికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందిపై ఫిర్యాదు..

మెంటాడ: మండల కేంద్రంలో జరిగిన స్పందన కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పనితీరుపై పలువురు ఫిర్యాదు చేశారు. మండలంలోని కైలాం గ్రామానికి చెందిన బగ్గాం చంద్రశేఖరరావు అనే రైతు మ్యూటేషన్‌కు సంబంధించి, సచివాలయంలో దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా ఇప్పటికీ రెవెన్యూ సిబ్బంది స్పందించ లేదని ఎంపీడీఓ త్రివిక్రమ్‌కు తెలిపారు. బడేవలస, ఇద్దనవలస గ్రామాలకు సంబంధించిన ఇంటి బిల్లుల మంజూరులో హౌసింగ్ శాఖ సిబ్బంది జాప్యం వహిస్తున్నట్లు ఫిర్యాదులు రాగా, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు.

తెర్లాం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమానికి పలు సమస్యలపై ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుందరాడ మాజీ సర్పంచ్ అద్దంకి వెంకటరావుతో పాటు మరో 16 మంది మహిళలు గ్రామంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలో నీటి సమస్య ఉందని, విద్యుత్ లైన్లు వేయాలని కోరారు. ఎంపీడీఓ స్పందిస్తూ విద్యుత్ శాఖ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడి, సమస్య పరిష్కరించాలని కోరారు. అలాగే అరసబలగ గ్రామంలో కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలని, తాగునీటి పథకం పైపులైన్ మురుగునీటిలో ఉందని, దానిద్వారా వచ్చే నీరు తాగడం ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామ యువత కోరారు. రాజయ్యపేటకు చెందిన రేట్ల పెదతాడు భార్య స్పందనకు వచ్చి తన భర్త 2021లో పాముకాటుకు గురై, మరణించాడని, బీమా కింద రూ.లక్ష మాత్రమే వచ్చాయని, మిగిలిన రూ.4 లక్షలు ఇంత వరకు రాలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ కాల్ సెంటర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని వెలుగు ఏపీఎంకు సూచించారు.

బాడంగి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భవన నిర్మాణాల ప్రగతిపై ఎంపీడీఓ ఆంజనేయులు సమీక్షించారు. ఈ నెల 15వ తేదీలోగా సచివాలయ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ ఆదేశించారు. అలాగే పెండింగ్‌లోని స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.